క్లుప్తంగా

పాఠశాలలో ఓనం వేడుకలు



ఓనం వేడుకల్లో టీచర్లు, విద్యార్థులు

గాలివీడు : కేరళ రాష్ట్రం ప్రత్యేక పర్వదినమైన ఓనమ్ పండుగను స్థానిక గౌతమ్ పాఠశాలలో కేరళ ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ వేషధారణలో పాల్గొని పువ్వులను అలంకరించి, సాంప్రదాయ ఆటలు, పాటలతో సందడి చేశారు. అనంతరం ప్రత్యేక వంటకాలను తయారుచేసి రుచిచూశారు. పాఠశాల ప్రతినిధులు సైజు థామస్, షింటో ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ఓనం పండుగ ఐక్యత, సాంప్రదాయాలకు ప్రతీక అన్నారు.

వైభవంగా ఉరుసు



విద్యుత్ వెలుగుల్లో జమాలుల్లా బాబా దర్గా

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం పాతరాయచోటిలో వెలసియున్న హజరత్ జమాలుల్లా బాబా ఉరుసు ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉరుసు ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి గంధోత్సవం వైభవంగా జరగ్గా శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హిందూ, మహమ్మదీయ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని దర్గాతో పాటు ముఖద్వారం, స్వాగత తోరణాలు విద్యుత్ కాంతులీనాయి. పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తాదులు బాబాను దర్శించుకున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

లక్కిరెడ్డిపల్లి : తిరుపతి రమాదేవిమల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో కోనంపేటలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇరవై మందికి తిరుపతికి రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ వెంకటేష్ కుమార్, హాస్పిటల్ సిబ్బందిని గ్రామపెద్దలు, ప్రజలు సన్మానించారు.

ఎన్‌ఆర్ పురానికి చేరిన సోమశిల జలాలు



పెనగలూరు : సోమశిల వెనుక జలాలు మండలంలోని ఎన్‌ఆర్ పురానికి తాకాయి. దీంతో ఎన్‌ఆర్ పురం నుంచి సిరియవరం, చుక్కాయిపల్లి, చాపలవారిపల్లి గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. సోమశిల జలాలు అధికంగా రావడంతో ఎన్‌ఆర్ పురం వద్ద కట్టుకొమ్ము పార్లి గుంజనేరు నదిలోకి నీరు చేరుతున్నాయి. తిరునంపల్లి నుంచి పెనగలూరుకు ఉన్న రోడ్డు నీటిలో మునిగింది. గతంలో ఆయా గ్రామాల ప్రజలు వారి సొంత నిధులతో ప్రత్యామ్నాయ మార్గాన్ని వేసుకున్నారు. వర్షాలు కురిస్తే ప్రస్తుతం ఉన్న నీట మునిగి ఎన్‌ఆర్ పురం తదితర గ్రామాలకు మండల కేంద్రంతో రాకపోకలు నిలిచిపోనున్నాయి. మండలంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువ ఉన్నప్పటికీ సోమశిల వెనుక జలాల రాకతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగనుండటంతో రైతాంగంలో ఆశలు చిగురించాయి.

రూ.2.10లక్షలకు లడ్డూ




సంబేపల్లె : మోటకట్ల గ్రామం కేతంరెడ్డిగారి పల్లెలో గణనాథుని నిమజ్జనంలో భాగంగా లడ్డూ వేలం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన వసంత ప్రతాప్‌రెడ్డి, వసంత చరణ్‌కుమార్‌రెడ్డి, కేతంరెడ్డి విశ్వసేతునాథ్‌రెడ్డి గణపతి లడ్డూను రూ.2.10లక్షలకు కైవసం చేసుకున్నారు.

రూ.46 వేలు పలికిన లడ్డూ



నందలూరు : నాగిరెడ్డిపల్లి పంచాయతీ అరవపల్లి క్రీడా మైదానం వద్ద వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన వేలం పాటలో లడ్డూ రూ.46 వేలు ధర పలికింది. అదే ప్రాంతానికి చెందిన మద్దికేర ఓబులేసు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

చిన్నమండెంలో..



చిన్నమండెం : మండలంలోని కొత్తపల్లి పంచాయతీ నేరలోంక గ్రామంలో నెలకొల్పిన గణనాథుని విగ్రహం వద్ద వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. వేలంలో బొమ్మిడి సతీష్‌కుమార్‌రెడ్డి రూ.70 వేలకు పాడి లడ్డూను దక్కించుకున్నారు.

రైతులకు శాపంగా చంద్రబాబు పాలన

- ఎరువులు అందక అల్లాడుతున్న రైతాంగం
- వైఎస్‌ఆర్‌సీపీ రైతు విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు కామసాని చెన్నకేశవరెడ్డి



సిద్దవటం: మాట్లాడుతున్న మండల నాయకులు



రాయచోటి జగదాంబసెంటర్: మాట్లాడుతున్న చెన్నకేశవరెడ్డి



సుండుపల్లె: మాట్లాడుతున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



నందలూరు: మాట్లాడుతున్న సిద్దవరం గోపిరెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలన రైతులకు శాపంగా మారిందని వైఎస్‌ఆర్‌సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కామసాని చెన్నకేశవరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం రాయచోటిలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల వైఎస్‌ఆర్‌సీపీ రైతు విభాగపు అధ్యక్షులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత 14 నెలల పాలనలో ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఒక్క పంటకూ కనీస మద్దతు ధర ప్రకటించలేదని ఆరోపించారు. ఖరీఫ్ పంటల సాగు ముమ్మరంగా కొనసాగుతున్న సమయంలో ఎరువులు సకాలంలో సరఫరా చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతులకు అవసరమైన పంటల బీమా, నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు వంటి ప్రోత్సాహకాలు చంద్రబాబు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు రైతు భరోసా, పంటల బీమా, వరదల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వంటి ప్రయోజనాలు సకాలంలో అందేవని గుర్తు చేశారు. ఈ సీజన్‌లో వర్షాభావం కారణంగా ఖరీఫ్‌లో వేసిన వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయిందని, వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయకపోవడం దీనికి కారణమని తెలిపారు. అలాగే మామిడి, టమాటా పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తమ పంటలు రోడ్ల మీద పారవేస్తున్న విషాద స్థితి నెలకొందన్నారు. రైతుల సమస్యలను లెక్కచేయని కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు సెప్టెంబర్ 9వ తేదీన రాయచోటి జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబేపల్లి రైతు విభాగం అధ్యక్షులు అమరనాథరెడ్డి, రామాపురం రైతు విభాగం అధ్యక్షులు నాగబసిరెడ్డి, లక్కిరెడ్డిపల్లి రైతు విభాగం అధ్యక్షులు మల్‌రెడ్డి, రాయచోటి రైతు విభాగం అధ్యక్షులు రమణారెడ్డి పాల్గొన్నారు.

9న రైతుల నిరసన కార్యక్రమం

నందలూరు : రైతుల పాలిట శాపంగా మారిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 9న రాయచోటిలో చేపట్టిన రైతుల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పంటలకు కావాల్సిన యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. రైతులకు ప్రయోజనకరమైన పథకాలను నిలుపుదల చేసి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. అలానే పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం తదితర అంశాలపై నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. కావున మండలంలోని రైతులు, రైతు సంఘ నాయకులు, సన్నకారు రైతులు తదితరులు నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతులను దోచుకుంటున్నారు

సుండుపల్లె : కూటమి ప్రభుత్వంలో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని మండల వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు మండిపడ్డారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆదేశానుసారం మండల కేంద్రంలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులకు యూరియా దొరకడం లేదని దీంతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా రైతులకు సకాలంలో ప్రతి ఒక్కటీ అందుబాటులోకి తీసుకొని వచ్చే వారని రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని వారు తెలియజేశారు. ఇప్పుడు ఆర్బీకేలలో కాకుండా ప్రైవేటుగా యూరియాను అమ్ముతున్నారని ఆర్బీకేలలో బస్తా రూ.270 అయితే ప్రైవేటుగా రూ.330 నుండి రూ.350 వరకు అమ్ముతూ రైతులను దోచుకుంటున్నారని వారు వాపోయారు. రైతుల పక్షాన రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9వ తేదీ జిల్లా కేంద్రమైన రాయచోటిలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతులకు, ప్రజానీకానికి వారు పిలుపునిచ్చారు.

విజయవంతం చేసుకుందాం

సిద్దవటం : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో రైతుల సమస్యల పట్ల వైఎస్సార్‌సీపీ చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిద్దవటం మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి పిలుపునిచ్చారు. సిద్దవటం మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులు, కౌలు రైతులు యూరియా దొరకక, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక, పంటల బీమా చెల్లించక కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పైన ఈనెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు రాయచోటిలో నిరసన కార్యక్రమానికి మండలంలోని రైతులు, రైతు కూలీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కేవీ సుబ్బయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఏకుల రామిరెడ్డి, నిమ్మకాయల ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం



మాట్లాడుతున్న ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

ఒంటిమిట్ట : యూరియా కోసం రైతులు అవస్థలను చులకనగా మాట్లాడిన సీఎం నారా చంద్రబాబు నాయుడు మాటలు వింటుంటే ఆయన రైతు వ్యతిరేకి అని మరోసారి నిరూపించుకున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇగరంరెడ్డి సుబ్బారెడ్డి విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తమాధవరంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి ఆధ్వర్యంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. వరి సాగు చేసేందుకు యూరియా కూడా దొరకని స్థితిలో రాష్ట్రం ఉండటం దౌర్భాగ్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులు వేసిన ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు అండగా నిలిచి వ్యవసాయాన్ని పండుగను చేస్తే, కూటమి అధికారం చేపట్టాక రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఎద్దేవా చేశారు. రైతులను విస్మరించిన చంద్రబాబు పాలనకు నిరసనగా ఈ నెల 9న రాయచోటిలో నిర్వహించబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డిలకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

గాలివీడు : కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుందామని వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, హిందూపురం పరిశీలకులు రమేష్‌కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం వారు ప్యారంపల్లె గ్రామం పెడకంటి కొత్తపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా మోసం చేసిందని మండిపడ్డారు. కూటమి నాయకుల అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం తమటం మధుసూదన్ రెడ్డి కుమార్తె, అదే గ్రామానికి చెందిన కాల్వపల్లె నారాయణ రెడ్డి కుమారుని వివాహ వేడుకలలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలానే చీమల చెరువుపల్లె సర్పంచ్ కాల్వపల్లె కృష్ణారెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నూలివీడులో జరిగిన ఎంపీటీసీ అమానుల్లా గృహ ప్రవేశ వేడుకలలో పాల్గొన్నారు.

గణనాథుని నిమజ్జనం



సంబేపల్లె : మండలంలోని వివిధ గ్రామాలలో కొలువైన గణనాథులను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను పురవీధులలో ఊరేగిస్తూ ఆయా గ్రామాలలోని చెరువులు, కుంటలు, వాగులలో ఉన్న నీటిలో నిమజ్జనం చేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణం ఆర్‌ఎస్‌రోడ్డులోని పోలా వారి కాకతీయ విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. తిరుపతికి చెందిన వెంకటరమణ గుండె, మెటర్నటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ హాస్పిటల్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా గుండె స్కానింగ్, గుండెనొప్పి, గుండె దడ, ఛాతినొప్పి, అధిక బీపీ, చిన్నపిల్లల గుండె సమస్యలు, షుగర్ వ్యాధి వల్ల వచ్చే గుండె సమస్యలు, దీర్ఘకాలిక గుండె సమస్యలు, గర్భ సంచి, నీటిబుడగలు, పీసీఓడీ సమస్యలు, ఆయాసం, ఆస్తమా, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, నిమోనియా, క్షయ, ఛాతిలో నీరు, గాలి చేరడం, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి జబ్బులను ఉచితంగా చూడనున్నట్లు తెలిపారు. అలాగే బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఈసీజీ కూడా తీయనున్నట్లు తెలిపారు.

ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సి.వెంకటరమణ, డాక్టర్ ఆర్.నిరూపమ, డాక్టర్ ఏ.శ్రీకాంత్ యాదవ్ రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. వైద్య శిబిరంలో పాల్గొనే వారు పాత మెడికల్ రిపోర్టులను తమ వెంట తీసుకురావాలన్నారు. ఓపీ నమోదుకు 78937 10880, 78427 18995 నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



ఆహారం వడ్డిస్తున్న సీఐ రమణ

నందలూరు : మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సయ్యద్ మగ్దుమ్ షా ఖాదర్‌వలీ దర్గా పీఠాధిపతులు ఖాజా సయ్యద్ షా మొహమ్మద్ మొయిద్దీన్ హుస్సేని ఖాద్రీ ఆధ్వర్యంలో నందలూరు దర్గా నుంచి అరవపల్లి రైల్వే కేంద్రంలోని ఖాదర్‌వలీ దర్గా వరకు భారీగా అల్లాహుఅక్బర్ అనే నినాదాలతో ఇస్లామిక్ జెండాలు పట్టుకొని భారీ ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ ముఖ్య అతిథులుగా హాజరై పేదలకు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించి, స్వయంగా వడ్డించారు. దర్గా కమిటీ సీఐని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్, కమాల్‌బాషా, పఠాన్ కరీముల్లాఖాన్, షేక్ మౌలా, పఠాన్ మెహర్‌ఖాన్, సయ్యద్ అఫ్జల్, ఆకుల చలపతి, సయ్యద్ ఇక్బాల్, తాటి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆకేపాటిపై ఆరోపణలు తగవు

సుండుపల్లె : రాజంపేట ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని విమర్శించే స్థాయి చమర్తి జగన్‌మోహన్‌రాజుకు లేదని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఎవరి స్థాయి ఏంటో ప్రజలకు తెలుసని, మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. సుండుపల్లెలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మీరు గతంలో ఎన్నిసార్లు ప్రజల చేత ఎన్నికయ్యారో గుర్తు చేసుకోవాలన్నారు. ఆకేపాటి చేస్తున్న సేవా కార్యక్రమాలు నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసు అన్నారు. ఆయన ప్రజలకు చేసిన సేవలే ఆయనను ఎమ్మెల్యేగా నిలబెట్టాయని, అలాంటి నాయకునిపై ఆరోపణలు చేయడం సబబు కాదని ఆయన తెలియజేశారు.

ఉపాధ్యాయులే ఉత్తమ సమాజ రూపకర్తలు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- డాక్టర్ సర్వేపల్లి సేవలను గుర్తు చేసుకున్న టీచర్లు
- ఉపాధ్యాయులను సత్కరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



రాజంపేట టౌన్: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, పోలా



ఓబులవారిపల్లె మండల కేంద్రంలో..

రాజంపేట టౌన్ : ఉపాధ్యాయులే సమాజ రూపకర్తలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కొనియాడారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం దేశ తొలి ఉపరాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆకేపాటి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితం ఉన్నతికి తల్లిదండ్రుల తర్వాత గురువులే ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. విద్యార్థులను సన్మార్గం వైపు పయనింపచేయడం గురువులకే సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత కూడా ఉపాధ్యాయులేదన్నారు. అందువల్ల సమాజంలో ఉపాధ్యాయులది గురుతర బాధ్యత అని తెలిపారు. సమాజంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి చదువే మూలమని, అందువల్ల విద్యాబుద్ధులు నేర్పే గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని తెలియజేశారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఆకేపాటి, పోలా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దయానంద్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆర్.శ్రీవాణి, వివిధ విభాగాల కన్వీనర్లు పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, డి.భాస్కర్‌రాజు, మిర్యాల సురేఖ, దండు గోపి పాల్గొన్నారు.

చిట్వేలిలో మానవత ఆధ్వర్యంలో..

చిట్వేలి : మానవత స్వచ్ఛంద సేవా సమితి చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యావనరుల కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన పి.రంగారెడ్డి, దొండ్లవాగు శ్రీనివాసులు, పి.లీలావతిలను ఘనంగా సన్మానించారు. మానవత బాధ్యులు మునిరావు, సాయిరాంలు మాట్లాడుతూ విద్యార్థులలో అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పెంచే దైవాలు ఉపాధ్యాయులు అన్నారు. కార్యక్రమంలో మానవత సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులకు విద్యార్థులు పాదపూజలు చేశారు. అనంతరం ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంపొందింపజేసే విధంగా విద్యార్థుల సన్మానం, బహుమతుల ద్వార తమ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులు తమ గురువులకు ఆటల పోటీలతో పాటు పాటల పోటీలను నిర్వహించి, బహుమతులు లందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూలో..

రాజంపేట : సమాజాభివృద్ధికి ఉపాధ్యాయులు మూలస్తంభాలని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం అన్నమాచార్య యూనివర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశానికి భావి భారత పౌరులను అందించేవారన్నారు. విద్యాభివృద్ధితో దేశాభివృద్ధి ఉంటుందని, అందులో ప్రధాన భూమిక పోషించేవారు ఉపాధ్యాయులు అన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ డా.సాయిబాబారెడ్డి, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జున, ఏయూ ఇంజనీర్ సుబ్బారెడ్డి, పీడీ నాగముని, హెచ్‌అండ్‌ఎస్ హెచ్‌ఓడీ డా.ఓబులపతి, టచ్‌స్టోన్ ఇన్‌చార్జి విజయకుమార్ ,అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రం నందు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు జి.చక్రాధర్ రాజు, బి.నాగా తిరుమలరావులు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత, సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వి.సిద్దయ్య, జిల్లా నాయకులు బి.నరేంద్రనాథ్, ఆర్థిక కార్యదర్శి ఎం.శివరాం ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు మునగపాటి శ్రీను, ఎస్టీయూ నాయకులు హరినాథ్, బాలనరసింహులు, మహిళా నాయకురాలు హైమావతి తదితరులు పాల్గొన్నారు.



పుల్లంపేట: విశ్రాంత, సీనియర్ టీచర్లను సన్మానించిన ఎంఈఓలు, నాయకులు



రాజంపేట: ఏయూలో సర్వేపల్లి చిత్రపటానికి అధ్యాపకుల నివాళి



చిట్వేలి: విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మానవత సభ్యులు



సంబేపల్లె: గురువులను సన్మానించి, బహుమతులు అందజేసిన విద్యార్థులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో గురు పూజోత్సవ కార్యక్రామాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు రామలింగరాజును పాఠశాల కరెస్పాండెంట్ టీ యువరాజ శాలువ పూల మాలతో ఘనంగా సత్కరించారు.